

www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 29 సెప్టెంబర్ 2024



అమ్మవారి సేవలో సుప్రీం ప్రధాన జస్టిస్



రెండు రోజుల పర్యటనలో భాగంగా కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న చంద్రచూడ్

జాతరలో దాడికి పాల్పడిన పోలీసులపై.. అట్రాసిటీ కేసు పెట్టాలి



దళితుడు చెంచుకుమార్‌కు న్యాయం చేయాలని వామపక్ష, దళిత సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - వెంకటగిరి

వెంకటగిరి జాతరలో దళితుడైన చెంచుకుమార్‌పై దాడికి పాల్పడిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని, అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్‌చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద వామపక్ష, దళిత ప్రజాసంఘాలు శనివారం ధర్నా నిర్వహించాయి. తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా ఉద్దేశించి సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి, రైతుకూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య మాట్లాడుతూ వెంకటగిరి పోలేరమ్మ జాతరలో దళిత యువకుడు లంకా చెంచుకుమార్ 'పీక' ఊదినందుకు పోలీసులు విచక్షణారహితంగా లాఠీలతో రక్తం వచ్చేలా గాయపరచడం దుర్మార్గమన్నారు. దాడికి పాల్పడిన పోలీసు కానిస్టేబుల్ శివకుమార్, జయచంద్రలను సస్పెండ్ చేయాలన్నారు. మరో 15 మంది దాడిలో పాల్గొన్నారని, వారిపైనా చర్య తీసుకోవాలన్నారు. మూడు రోజులైనా ఇంతవరకూ పోలీసులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం పోలేరమ్మ జాతరలో ముందుగానే [illegible] సంఘాన్ని ఏర్పాటు చేసి, అన్ని పార్టీల నుంచి సూచనలు, సలహాలు తీసుకుని ప్రశాంతంగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించినందున సమస్యలు రాలేదన్నారు. గాయపడిన చెంచుకుమార్‌కు చట్టప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. దళితుని న్యాయం జరిగే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గురవయ్య, ఎమ్మార్పీఎస్ పల్లిపాటి రవి, సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి వడ్డిపల్లి చెంగయ్య, సిపిఐ నియోజకవర్గ ఇన్చార్జ్ పి బాలకష్ణయ్య, సిఐటియు నాయకులు ఉదయభాస్కర్ ఏఐటీయూసీ నాయకులు జాన్, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు మణి,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిహెచ్ రమణయ్య పాల్గొన్నారు.

మానవత్వం లేకే 'మతం'ముసుగు



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - రేణిగుంట, యంత్రాంగం

భగత్‌సింగ్ స్వాతంత్ర్య పోరాటం, గుర్రం జాషువా అసమానతలపై ప్రశ్నించిన వైనాన్ని వక్తలు కీర్తించారు. తిరుపతి ఆర్ట్స్ కాలేజీలో భగత్‌సింగ్ జయంతి సభ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. డీన్ ఆచార్య బివి మురళీధర్ మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయాలను విద్యారంగంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఎస్‌జిఎస్, ఎస్వీ యూనివర్సిటీ ప్రకాశం భవనంలో, ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో దాదాపు మూడువేల మంది విద్యార్థులతో భగత్‌సింగ్‌కు నివాళి అర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి మాధవకృష్ణ మాట్లాడుతూ నేటి యువత విద్యారంగంలో వస్తున్న అంశాలపై అవగాహన పెంచుకుని దేశం కోసం పరితపించే బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కార్యదర్శి వినోద్, యూనివర్సిటీ నాయకులు సుష్మిత, వీరేష్, అశోక్, నగర నాయకులు హర్షద్,చైతన్య, లోకేష్, రవీంద్ర, వాసు తదితరులు పాల్గొన్నారు. స్విమ్స్ బ్లడ్ బ్యాంకులో 20 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ముత్యాలరెడ్డి ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని మహాత్మాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు.

బిఎన్ కండ్రిగలో.. కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో జాషువా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో అంటరానితనం, అసమానతలను రూపుమాపడానికి తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరచిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని శతావధాని ఆముదాల మురళి అన్నారు. ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్ బాబు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, జాషువాలకు నివాళి

రేణిగుంటలో... బాలురు, గురుకుల, బిసి హాస్టళ్లలో సాహితీ స్రవంతి, వేమన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాషువా, భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. 'గుర్రం జాషువా విశ్వ నరుడు పద్యాన్ని అందరూ కలిసి ఆలపిస్తూ జాషువా భావాలు ముందుకు తీసుకెళ్తామని, కులమత బేధాలు లేకుండా కలిసిమెలిసి ఉంటామని విద్యార్థులందరూ ప్రతిజ్ఞ పూనారు. జెవివి నాయకులు ఒ.వెంకటరమణ, ముఖేష్, ఉపాధ్యాయులు చంద్రమోహన్, బాబు పాల్గొన్నారు. **శ్రీకాళహస్తిలో** పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్, కుమార్ పాల్గొన్నారు. **పుత్తూరులో...**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వి.వీరయ్య ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి వేడుక నిర్వహించారు. వీరయ్య మాట్లాడుతూ దళిత కుటుంబంలో జన్మించిన జాషువా సామాజిక అసమానతలపై ఎక్కుపెట్టిన అస్త్రమని అన్నారు. పూజారి వెంకటేశన్, మన్యం నరసింహులు, ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు. **రా వు చం ద్రా పు రం (చంద్రగిరి)లో..** ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌కు నివాళి తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు తేజ, నాయకులు బాల, గణేష్ మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాన్నారు. ఈ సందర్భంగా బాలికల పాఠశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

మానవత్వం లేకే 'మతం'ముసుగు

నమ్మిన సిద్ధాంతాన్ని నిలబెట్టిన నిలువెత్తుమనిషి, ప్రజాకవి గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా తిరుపతి లోని వేమనవిజ్ఞానకేంద్రంలో శనివారం సాయంత్రం కవి సమ్మేళనం జరిగింది. వేమనవిజ్ఞానకేంద్రం, సాహితిస్రవంతి సంయుక్త ఆద్వర్యంలో జరిగిన ఈ కవిసమ్మేళనంలో సీనియర్ జర్నలిస్టు రాఘవ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సమ్మేళనంలో జాషువా కవిత్వం, జీవితం గురించి భారతి వివరించారు. నెమలేటికిట్టన్న, ప్రవీణ్, ఆమూరి సుబ్రమణ్యం, సాహితీవేత్త సాకం నాగరాజ, పరమేశ్వర్ రావు, నాగలక్ష్మి, ఓ.వి.రమణ, డాక్టర్ గోపాల్, శ్రీనివాసులు, ఆదిశేషు, టెంకాయల దామోదరం, వేమనవిజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



తిరుమలలో 'డిక్లరేషన్' డ్రామా

జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో వైసిపి 'సంప్రోక్షణ'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటనను టీడీపీ నేతలు రాజకీయం చేశారని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, వైసిపి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. జగన్ వస్తున్నారనగానే ఎప్పుడూ లేని విధంగా తిరుమలలో డిక్లరేషన్ బోర్డులు పెట్టారన్నారు. జగన్ పర్యటన రద్దు అయ్యిందని తెలియగానే ఆ బోర్డులను తొలగించారన్నారు. ఇది రాజకీయం కాదా? అని వారు నిలదీశారు. తిరుమల ప్రసాదంపై సీఎం చంద్రబాబునాయుడు అపవిత్రమైన కామెంట్స్‌ను నిరసిస్తూ, వైసీపీ పిలుపు మేరకు తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడి లో వైసిపి ఆధ్వర్యంలో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు.



తడలో..

తడ సర్పంచి కేలివి ఆర్ముగం ఆధ్వర్యంలో బస్టాండ్ దగ్గర ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తడ మండల వైస్ కన్వీనర్లు నందారెడ్డి, మొలవాయుల రమేష్‌రెడ్డి, ఎఎంసి మాజీ వైస్‌ఛైర్మన్ నాగరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గూడూరులో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్థానిక సంస్థల ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. భగవంతున్ని రాజకీయాలకు వాడుకోవడం దురదృష్టకరమన్నారు. సత్యవేడులో మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇరుగుళం ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తిలో మాజీ ఎంఎల్‌ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి, నాయకులు అంజూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

పూజలు చేస్తే పాపాలు పోవు : కూటమి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి తిరుమల పర్యటనను అడ్డుకోవాలని ఎవ్వరూ ప్రయత్నంచేయ్యలేదని, గతంలో పోలీసులతో నిర్బంధం చేసిన ఘనత వైసిపి నాయకులకే దక్కిందని టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహా యాదవ్ అన్నారు. ఆలయాల్లో పూజలు చేసినంత మాత్రాన చేసిన పాపాలు పోవన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తమ స్వార్థ రాజకీయ లబ్దికోసం శ్రీవారి నిధులను వాడుకోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హాయంలో టీటీడిలో జరిగిన అన్నింటిపై కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టిందని, అన్ని విషయాలు త్వరలోనే బయటికి వస్తాయన్నారు. యశ్వంత్, హేమంత్ యాదవ్, మనోహరాచారి తదితరులు పాల్గొన్నారు.

జగన్ తిరుమల పర్యటన ఓ డ్రామా



వ రా జీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తనపై ఉన్న సిబిఐ కోర్టు కేసుల వాయిదాలను తప్పించు కోవాలనే తిరుమల పర్యటన డ్రామా ఆడారని తిరుపతి పట్టణ జనసేన పార్టీ ఇంఛార్జి కిరణ్ రాయల్ ఆరోపించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతిలో మత కల్లోలాలు సష్టించాలని కుట్ర చేశారని, వైసిపి వారు వారిపై వారే కోడిగుడ్లు, టమోటాలు వేయించుకుని కూటమి నేతలపై నెట్టాలని చూసారన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ బాధ్యత ప్రతి భారతీయుడిదని నగరి జనసేన ఇన్‌ఛార్జి మెరుపుల మహేష్ అన్నారు. వడమాలపేటలోని అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో పవన్ దీక్షకు మద్దతుగా పూజలు నిర్వహించారు.

'హె సిరి అలా వెళ్ళకే' ట్రైలర్ విడుదల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రేమ వయస్సుకు సంబంధించి కాదని, మనస్సుకు సంబంధించిదనే కథాంశంతో తెరకెక్కుతున్న హె సిరి అలా వెళ్ళకే వెబ్ సీరిస్ చిత్రం ట్రైలర్ను శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో చిత్ర యూనిట్ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత షీలా లోకనాథమ్ మాట్లాడుతూ 33 నిముషాల నిడివితో మూడు భాగాలుగా ఈ వెబ్ సీరిస్ చిత్రాన్ని తిరుపతి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించామన్నారు. ఇప్పటికి ఒక బాగం పుర్తయిందన్నారు. చిత్ర యూనిట్ సభ్యులు మాట్లాడుతూ తిరుపతిలో ఎంతో మంది మంచి కళాకారులు ఉన్నారని, వారికి తగిన ప్రోత్సాహకం ప్రభుత్వం అందించి గుర్తింపు కార్డులను మంజూరు చేయ్యాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో చిత్ర దర్శకుడు, కెమరామెన్ కిరణ్ క్రిస్టోఫర్, కధా నాయకుడు సాయినాథ్, కధా రచయిత భరత్, మౌనిక, కామెడీ, శాస్త్రీ, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



బదిలీ చేస్తే మాకేంటి..?

శ్రీకాళహస్తి ఆలయ ఉద్యోగుల తీరు
100 రోజులైనా పట్టించుకోని 'కూటమి'



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి


టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు ఉద్యోగులపై బదిలీ వేటు పడింది. మరికొంతమందిపైనా బదిలీ వేటు తప్పదన్న సంకేతాలు వస్తున్నాయి. అయితే బదిలీల విషయం అంటుంచితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు 'బదిలీ చేస్తే మాకేంటి' అన్న పంథాలో వారి తీరు ఉంది. ఉన్న చోట పని చేయరన్న విమర్శలు ఏళ్ల తరబడి వినిపిస్తూనే ఉన్నాయి. తమ పలుకుబడి వినియోగించి ఆదాయ మార్గాలు అధికంగా వచ్చే చోట విధులు నిర్వర్తిస్తున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు. దీంతో తమను బదిలీ చేసినా తమకేం భయం లేదన్న ధోరణిలో కొందరు ఉద్యోగుల తీరు కనిపిస్తోంది.

ఉదాహరణకు శ్రీకాళహస్తీశ్వరాలయంలో 35 మంది వేద పండితులు, 36 మంది అర్చకులు, 25 మంది పరిచారకులు స్వామి అమ్మవార్లకు నిత్య సేవలు చేస్తూ ఉన్నారు. వీరిలో వేద పండితులు వేదమంత్రాలను, అర్చకులు స్వామి అమ్మవార్లకు, పరివార దేవతలకునిత్య కైంకర్యాలు చేయాల్సి ఉంటుంది. పరిచారకులు వీరికి సహాయకులుగా మాత్రమే వ్యవహరించాల్సి ఉంటుంది. అయితే పరిచారకుల్లో కొందరు అర్చకుల అవతారమెత్తి రాహు-కేతు మండపాల వద్ద, పరివార దేవతల ముంగిట హారతి పళ్లాలు పడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా పరిచారకుల విధి ప్రసాదాల పోటులో సహాయకులుగా, పర్యవేక్షకులుగా ఉండడం. అయితే ప్రసాదాల పోటును మరిచి ఆలయం లోపలే కొంతమంది పరిచారకులు ఎక్కువసేపు గడుపుతున్నట్లు సమాచారం. దీంతో ప్రసాదాల నాణ్యత దెబ్బతింటుందన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే తిరుపతి లడ్డు నాణ్యత పై తీవ్ర దుమారం రేగుతున్న సంగతి తెలిసిందే. ఆ ఆరోపణలు ముక్కంటికి పాకాయి. ఈ క్రమంలో మరింత బాధ్యతగా పరిచారకులు వ్యవహరించాల్సి ఉంది.

గత వైసిపి పాలనలో శ్రీకాళహస్తి ఆలయం భ్రష్టు పట్టిందన్న ఆరోపణలు వచ్చాయి. అన్ని విధాలుగా అవినీతి అక్రమాలు జరిగాయనీ, దళారులు రాజ్యమేలినట్లు కూటమి నేతలు ఆరోపణలు చేశారు. ఎన్నికల తర్వాత తాము అధికారంలోకి వస్తాం..విచారణ చేయిస్తాం... బాధ్యులపై చర్యలు తీసుకుంటామని గొప్పలు పోయారు. అయితే అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా అవినీతి అక్రమాలపై కనీసం ప్రాథమిక విచారణ కూడా జరగలేదు. ఎవరిపై ఎటువంటి చర్యలు లేవు. ఆలయంలో ముఖ్యమైన ఇద్దరు అధికారులు బదిలీ అయ్యారు. ఒకరు ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారి కాగా, మరొకరు ఆలయ పరిపాలన అధికారి. ఇంకొందరు కింది స్థాయి ఉద్యోగులు. గత ప్రభుత్వ హయాంలో టెండర్లు, కొటేషన్లు, అంచనాలు లేకుండా ఇష్టం వచ్చిన విధంగా పనులు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువ పనులు ఒకే కాంట్రాక్టర్ ద్వారా చేయించారన్న విమర్శ ఉంది. అనాటి నాయకులకు బాగా "సాయం" చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అదేవిధంగా మరో అధికారి కలెక్షన్ కింగ్‌గా వ్యవహరించారు. ఆలయంలో అయ్యవార్ల వద్ద వసూలు చేయడంలో ఆయన దిట్ట. జరిగిన వసూళ్లలో నాయకులకు వాటాలు ఇవ్వడంలో ఆరితేరిన వ్యక్తి. అయితే కొత్త ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటినా ఎవరిపైనా ఎటువంటి విచారణలు జరగకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటే ఇతరులు జాగ్రత్త పడతారు. మరోసారి అటువంటి అవకతవకలకు అవకాశం ఉండదు. అయితే ఆ దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. 'దొందూ.. దొందేనని' జనాలు అనుకుంటుండటం గమనార్హం.

100 రోజులు పూర్తయ్యింది సరే..

సమస్యల పరిష్కారం ఎప్పుడు..?



ప్రజాశక్తి-తిరుపతి సిటి

'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులకు వినతుల వెల్లువ పారింది. అనేక సమస్యలను ప్రజలు నాయకుల దృష్టికి తీసుకెచ్చారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల ద్వారా సమస్యలను మాత్రం గుర్తించారే కానీ వాటిని ఎప్పుడు పరిష్కరిస్తారనే హామీలు ఇవ్వకపోవడం గమనార్హం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సరిగ్గా 100 రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా ఈ నెల 20 నుంచి 27వ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో బాగంగా తిరుపతి జిల్లాలోనూ ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల వద్దకెళ్లి ప్రజావేదిక కార్యక్రమాన్ని చేపట్టారు. అభివృద్ధి, సంక్షేమం ఒకే పద్దతిలో ముందుకు తీసుకెళ్లాలని ఉద్దేశంతో, ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే ప్రజావేదిక లక్ష్యం. పట్టణ ప్రాంతాల్లో మరింత అబివృద్ధి చేయాలనే ఉద్దేశంతో తిరుపతి నగరంలో కూటమికి చెందిన జనసేన, టిడిపి, బిజెపి నాయకులు అన్ని డివిజన్లలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ నెల 20వ తేదిన తిరుపతి జీవకోనలో ప్రారంభమైన ఈ కార్యక్రమం నగరంలోని 50 డివిజన్లలో పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ నెల 27వ తేదిన ఎంఆర్ పల్లి వద్ద జరిగిన చివరి సభతో ఈ కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా నగరంలో పలు సమస్యలను స్థానిక ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం కావడంతో టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో పాటు వైసిపికి చెందిన తిరుపతి ఎంపి డాక్టరు మద్దిల గురుమూర్తి, జనసేనకు చెందిన తిరుపతి ఎంఎల్ఏ అరణి శ్రీనివాసులు, వైసిపికి చెందిన ఎంఎల్‌సి డాక్టరు సిపాయి సుబ్రమణ్యం, వైసిపికి చెందిన నగర మేయరు డాక్టరు శిరీషా సభలకు హాజరయ్యారు. జిల్లా కేంద్రం కావడంతో జిల్లా కలెక్టరు, ఎస్‌పి, జాయింట్ కలెక్టర్, డిఎంహెచ్‌వో, అన్ని విభాగాల జిల్లా అధికారులు కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. జీవకోన ,రాజీవ్‌గాంధీ ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపుల కొన్ని వీధుల్లో మురికికాల్వలు లేవని, వీధి దీపాలు వెలగడం లేదని, పారిశుధ్యం మెరుగుపరచాలని, కొన్ని ప్రాంతాలకు అపుడపుడు తప్ప మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, పలు చోట్ల ఆకతాయిల ఆగడాలు వల్ల మహిళలు, వృద్దులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని ప్రాంతాల్లో సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని, కొన్ని ప్రాంతాల్లో యుడిఎస్ ఏర్పాటు చేసి, కనెక్షన్లు ఇవ్వాలని, దొమలు బెడద ఎక్కువుగా ఉందని, ఆరోగ్య సమస్యలు, స్థానిక స్కూళ్లలో భద్రత చర్యలు తదితర సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముగింపు రోజు స్థానికులు నిలదీయడం, మీడియా ప్రశ్నించడంతో అధికారులు తూతూ మంత్రంగా సమాధానం ఇచ్చారు.

వేమూరులో మధ్యప్రదేశ్ రైతులు




తిరుపతి టౌన్ : మధ్యప్రదేశ్ రైతులు వేమూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పర్యటించారు. జీవామృతాన్ని ఫిల్టర్ చేయకుండా డైరెక్ట్‌గా డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నేరుగా పంట మొక్కలకు అందించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. రాస్, కెవికెవారి సహకారంతో క్షేత్రాల పరిశీలన జరిగింది. శాస్త్రవేత్త ప్రియాంక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంటి శ్రీదేవి, గీతారాణి, కల్పన, గురుప్రసాద్, నాంచారమ్మ, రాధిక పాల్గొన్నారు.

కరకంబాడి పాఠశాల విద్యార్థులకు అభినందనలు

రేణిగుంట : కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి జోనల్ పోటీల్లో విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. జిల్లాస్థాయి పోటీల కు ఎంపికైన వారిలో యోగ విభాగంలో శివకష్ణారెడ్డి, షటిల్ అండర్ 14పోటీలలో రోహిత్ రెడ్డి, కావ్య శ్రీ, భాను చంద్ర, అండర్ 17 లో ఆశ్రిత్, హేమన్ కుమార్ ఉన్నారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు రెడ్డియ్యలను ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగోన్నతిపై రత్నప్రసాద్ కర్నూలుకు బదిలీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ గా ఉంటూ తిరుపతి జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం జిల్లా వ్యవసాయ శిక్షణ సమన్వయ కర్త గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న రత్న ప్రసాద్ పదోన్నతి పై ఉమ్మడి కర్నూల్ జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమితులైనారు. తిరుపతి జిల్లా వనరుల కేంద్రం సీనియర్ ఎ డి ఎ భాస్కరయ్యకు తిరుపతి జిల్లా శిక్షణ సమన్వయకర్తగా బాద్యతలు అప్పచెప్పి శనివారం ఆయన రిలీవ్ అయ్యారు.

శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం ఇంజనీరింగ్ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అత్యాధునిక వైద్యంపై విస్తృత పరిశోధనలు

అనస్తీషియా వైద్యుల సెమినార్‌లో వక్తలు

ప్రజాశక్తి - తిరుపతి

రోగులకు మెరుగైన అత్యాధునిక వైద్యాన్ని అందించే దిశగా అనస్తీషియా విభాగంలో మరిన్ని పరిశోధనలు అవసరమని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కుమార్ పేర్కొన్నారు. అనస్తీషియా వైద్యుల 33వ వార్షిక సదస్సును తిరుపతిలోని శ్రీ కన్వెన్షన్ సెంటర్లో శనివారం ప్రారంభించారు. ఈ సదస్సుకు అనస్తీషియా వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పువేటి తారక ప్రసాద్ అధ్యక్షత వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన సిమ్స్ డైరెక్టర్ ఆర్వి కుమార్ మాట్లాడుతూ... వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఆ దిశగా మరిన్ని పరిశోధనలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యరంగంలో అనస్తీషియా డాక్టర్లది ప్రధానమైన భూమిక అని ఉద్ఘాటించారు. తిరుపతి నగరంలో వేలాది మంది యువ అనస్తీషియన్ల సదస్సు నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా యువ వైద్యులు కషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు గెస్ట్ ఆఫ్ హానర్ గా నేషనల్ అకాడమిక్ చైర్మన్ డాక్టర్ ఎం వి భీమేశ్వర్ హాజరై.. అనస్తీషియా వైద్యుల విశిష్టతను వివరించారు. పలు కీలక అంశాలపై సెమినార్లో ప్రసంగించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ తోట ఫనింద్రనాథ్ ఓరియేషన్ ప్రోగ్రాం పై డాక్టర్ మణికంఠ గెస్ట్ ఓరియేటర్ గా ప్రసంగించారు. పలు అంశాలపై సైంటిఫిక్ సెషన్, గ్రూప్ డిస్కషన్, ప్యానల్ డిస్కషన్లు నిర్వహించారు. ఈ సదస్సులో 9 మంది ఐఎస్ఎ నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్స్, ఎనిమిది మంది స్టేట్ పాస్ట్ ప్రెసిడెంట్ తో పాటు 1000 మందికి పైగా అనస్తీషియా వైద్యులు హాజరయ్యారు. ప్రముఖ వైద్యులు రాధా, ప్రదీప్ కుమార్, సూరిశెట్టి శ్రీనివాస్, చక్ర రావు, కామేశ్వరరావు, కుచల బాబు, ఠాగూర్, కిరణ్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు



స్విమ్స్‌లో జరిగిన వర్కుషాపులో అనస్తీషియా వైద్యులు

డీఎస్పీ మురళీధర్‌కు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

టాస్క్ ఫోర్సు డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డీ.మురళీధర్ ఏఎస్పీగా ఉద్యోగోన్నతిపై అనంతపురం ఏపీ పోలీస్ అకాడమీకి వెళుతున్న సందర్భంగా టాస్క్ ఫోర్సు సిబ్బంది శనివారం ఆయనకు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆయనకు శాలువ కప్పి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ పాల్గొన్నారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలి: టిటిడి అదనపు ఈవో

ప్రజాశక్తి -తిరుపతి బ్యూరో: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని టిటిడి అదనపు ఈవో సివిహెచ్ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, సివిఎస్‌ఓ శ్రీధర్‌తో కలిసి అదనపు ఈవో భద్రతా ఏర్పాట్లపై విస్తృతంగా సమీక్షించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం, వాహనసేవలు జరిగేలా చూడాలని టిటిడీ, పోలీసు ఉన్నతాధికారులను అదనపు ఈవో కోరారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటివి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గరుడసేవ రోజు ఇబ్బందులు లేకుండా గ్యాలరీలకు అన్నప్రసాదాలు చేరేలా చూడాలని అదనపు ఈఓకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాల్లో టిటిడీ భద్రత, జిల్లా పోలీసులు పరస్పరం సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జెఈఓ వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, అదనపు డిప్యూటీ ఈవో లోకనాథం, రవాణా విభాగం జిఎం శేషారెడ్డి పాల్గొన్నారు.

సిఐటియు మండల కన్వీనర్‌గా వెంకటేష్



ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: సిఐటియు మండల కన్వీనర్‌గా కావేరిపాకం వెంకటేష్ నియమితులయ్యారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం సిఐటియు శ్రీకాళహస్తి మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కన్వీనర్‌గా వెంకటేష్, కో కన్వీనర్‌గా మనోహర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా అన్వర్ బాషా, మునిచంద్ర, ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. అసంఘటిత రంగ కార్మికులను సంఘటితం చేసి, వారి సమస్యల పరిష్కారానికి సిఐటియు మండల కమిటీ పోరాడాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య సూచించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో చిత్తూరు అమృత భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 170 మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి ఐదువందల రూపాయలు విలువచేసే ప్యాడ్, జామెంట్రీ బాక్సు, ఐదు పెన్నులు, శతక పద్యాలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు ప్రతి విద్యార్థికి అందించారు. ఈ సందర్భంగా శతావధాని ఆముదాల మురళి, అమృత భారతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో విద్యతో పాటు సంస్కారం, విలువలను ఉపాధ్యాయులు నేర్పుతారని వారి అడుగుజాడల్లో నడుస్తూ విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమృత భారతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ రెడ్డి, పూర్ణిమ, సమన్వయకర్త శతావధాని ఆముదాల మురళి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్, ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, వేణుగోపాల్, సురేష్ బాబు, ఒబ్బులేటి ప్రసాద్, మాధవీలత, దాసు, దేవేంద్ర, లక్ష్మయ్య, జగన్నాధం పాల్గొన్నారు.

'ఆదిశంకర'లో ముగిసిన హ్యాకథాన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో 24 గంటల హ్యాకథాన్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేణుమాధవ్ మాట్లాడుతూ హ్యాకథాన్ లో పాల్గొన్న విద్యార్థులు పట్టుదలతో ఇచ్చిన సమయంలో పని పూర్తి చేయడం అభినందనీయం అన్నారు. ఈ హ్యాకథాన్‌లో పలు కళాశాలల విద్యార్థులు పాల్గొనడం అభినందనీయం అన్నారు. అనంతరం కళాశాల ఛైర్మన్ వంకి పెంచలయ్య విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ వంకి అనూష, డీన్ రాజయ్య, ఇమ్మానుయేల్, సురేష్, ఏవో రామయ్య పాల్గొన్నారు.



హ్యాకథాన్‌లో పాల్గొన్న ఆదిశంకర కళాశాల ప్రిన్సిపాల్ వేణుమాధవ్

సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్షపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రీయ మిలిటరీ స్కూల్, సైనిక్ స్కూల్లో 2025–2026 విద్యా సంవత్సరంలో 6వ, 9వ తరగతి ప్రవేశానికై జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బుధవారం 10 గంటలకు విశ్వం టాలెంట్ స్కూల్లో కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు 5 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని ఈ పోటీ పరీక్ష వివరాలు, వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పరీక్షలో సీట్లు పొందడానికి మెలుకువలను పద్ధతులను తెలుసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 8688888802, 9399976999 ఫోను నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

'దమ్మయాత్ర'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బౌద్ధ వ్యాప్తికి కృషిని విపరిస్తూ ఈ నెల 21న కేరళ లో ప్రారంభమైన అశోక–అంబేద్కర్ దమ్మ యాత్ర ఈ నెల 30న తిరుపతికి చేరుతుందని, ఈ యాత్రను విజయవంతం చేయాలని అంబేద్కర్ భవన్ నాయకులు పరమశివం పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన యాత్ర వివరాలను తెలిపారు. 30వ తేదీ తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించి, అటు నుండి మధ్యాహ్నం యాత్ర పయనమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బంటి సర్వార్ రజిత, భాస్కరరావు, శ్రీను, రెడ్డి నారాయణ, సురేష్, ఆశోక్ సామ్రాట్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆదిమూలం సేవలు మళ్లీ కొనసాగించాలి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో గత 23 రోజులుగా అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయని, మళ్లీ అభివృద్ధి సాధనకు ఎమ్మెల్యే ఆదిమూలం సేవలు కొనసాగించాలని, ఆయనపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో టిడిపి అధిష్టానం విధించిన సస్పెన్షన్ ఎత్తి వేయాలని కోరుతూ మండల దళిత నేతలు విన్నవించుకున్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద వారు నిరసన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆరోపణపై కుట్రకోణం దాగి వుందన్నారు. దీనిపై అత్యాచార కేసును పై కోర్టు సైతం కొట్టి వేసిందని, ఎమ్మెల్యేపై జాలితో నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించేందుకు అధిష్టానం వెంటనే అనుమతించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఎమ్మెస్ రవి, ఎస్సీ సెల్ లీడర్ యస్ నాగరాజు, ఢిల్లీ, రజని, ఏకాంబరం, రుక్కేష్, సుగుంధర్, వడివేలు లతోపాటు మండలంలోని దళిత నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాబిస్‌పై అవగాహన

ప్రజాశక్తి - సత్యవేడు: పిచ్చికుక్క కాటు వల్ల వచ్చే రాబిస్‌పై మండలంలోని దాసుకుప్పం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ రాబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా దాసుకుప్పం పిహెచ్‌సిలో పిచ్చికుక్క కాటువల్ల తలెత్తే అనర్థాలపై రోగులకు అవగాహన కల్పించారు. కుక్కకాటు వల్ల గాయమైన లోతు బట్టి రాబిస్‌కు కారణం అవుతుందన్నారు. దీనికి టీకా వేయించుకుంటే ప్రమాదాన్ని నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి ఎంపిహెచ్ఈఓ సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ నాగజ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ మురళీ, హెడ్ నర్స్ పార్వతి, ఫార్మసిస్ట్ భార్గవి, పలువురు రోగులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాల్లో గజల్ శ్రీనివాస్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రముఖ గజల్ కళాకారుడు గజల్ శ్రీనివాస్ శనివారం జంలీషా పీర్ దర్గా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్నారు. దర్గా వద్ద ప్రత్యేక పూజలు చేసి పాలు పంచుకున్నారు. అనంతరం తన గజల్ గానంతో భక్తులను అలరించారు. మానవ పర్యాయాలు గిన్నిస్ బుక్ రికార్డు విజేతైన గజల్ శ్రీనివాస్ ప్రతి ఏటా నిర్వహించే ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని గజల్ శ్రీనివాస్ అన్నారు. అనంతరం ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు గజల్ శ్రీనివాస్ ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతాపరంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

తుడా టవర్స్ నిర్మాణాన్ని వేగవంతం చేయండి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఆధ్వర్యంలో రాయల చెరువు రోడ్డులో నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణ పనులను తుడా ఉపాధ్యక్షులు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య శనివారం పరిశీలించారు. అనంతరం తుడా కార్యాలయంలో అధికారులతో సమావేశమై సమీక్షించారు. గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు 13 అంతస్థులతో తుడా టవర్స్ లో కల్పిస్తున్న వసతులు, ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలను అధికారులు తెలిపారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ కష్ణారెడ్డి, ఈఈ రవీంద్రయ్య, డిఈ బాషా, ఏఈ షణ్ముగం, కె.పిసి సంస్థ ఈడి సుశీల్ కుమార్ ఉన్నారు.

మితిమీరుతున్న అర్ధరాత్రి 'ఆడంబరాలు'

రోడ్లపైనే యువత పుట్టినరోజు వేడుకలు



ప్రజాశక్తి - నాయుడుపేట పాశ్చాత్య ధోరణి రోజురోజుకూ మితిమీరిపోతోంది.. అర్ధరాత్రి ఆడంబరాల వేడుకలు మిన్నంటుతున్నాయి.. రోడ్లపైనే యువత బండ్లపై కేక్‌లు, మద్యం ఉంచి పుట్టినరోజు వేడుకలను అట్టహాసంగా జరుపు కుంటున్నారు. ఈ ఆడంబరాల్లో గం'జాయ్'కీ చోటు లేకపోలేదు. ఈ పరిస్థితి చుట్టుపక్కల ఇళ్ల వారికి ఇబ్బందిగా మారుతోంది.. అర్ధరాత్రయ్యిందంటే చాలు నెలలో పదిరోజులపైనే గందరగోళంగా అరుచుకోవడం, కేకలు వేయడం, ఆడంబరంగా కేకులు కట్ చేయడం, మద్యం బాటిళ్లతో వీరంగం చేయడం షరా మామూలయ్యింది. ఇదంతా ఒక ఎత్తయితే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడం స్థానికులను మరింత ఆవేదన కలిగిస్తోంది.

గతంలో పుట్టినరోజు వేడుకంటే ఉదయాన్నే కుటుంబ సమేతంగా గుళ్లకు వెళ్లడం, సాయంత్రం బంధువులను, స్నేహితులను ఇళ్లకు పిలిచి వేడుక జరుపుకునేవారు. అందరికీ ఆప్యాయంగా స్వీట్లు తినిపించి, భోజనాలూ పెట్టించేవారు. లేదంటే స్నేహితులతో కలిసి హోటళ్లలోనో, బార్లలోనో ప్లాన్ చేసుకునేవారు. ప్రస్తుతం ట్రెండ్ మారింది. ముందురోజు ఫ్లెక్సీల జాతర మొదలవుతుంది. వీధుల్లో భారీ ఫ్లెక్సీలతో రోడ్లను నింపేస్తున్నారు. అర్ధరాత్రి రోడ్డుకు అడ్డంగా యువత వాహనాలు నిలిపేసి 12 గంటలకు బాణసంచా పేలుస్తూ అర్థం లేని వెర్రిచేష్టలకు తెరలేపుతున్నారు. ఈ ట్రెండ్ ఓ పెద్ద నాయకుడి నుంచి మొదలై కాలేజీ స్టూడెంట్స్ వరకూ పాకి, ప్రస్తుతం టెన్త్ క్లాస్ పిల్లల వరకూ వచ్చింది. దీన్ని వారించాల్సిన తల్లిదండ్రులు సైతం వీరికి వంత పాడుతుండటం గమనార్హం. ఎవరినైనా స్థానికంగా ప్రశ్నిస్తే 'మొన్న వాళ్లు చేస్తే ఏమీ అనలేదే' అని నెగిటివ్‌గా మాట్లాడుతూ అడిగిన వారిని టార్గెట్ చేస్తూ తిట్టిపోస్తున్నారు. ఇది ఒక్క బర్త్‌డే వేడుకలకే పరిమితం కాలేదు. విజయోత్సవ వేడుకలు, పార్టీల ఆవిర్భావ దినోత్సవాలు, తమ అభిమాన నాయకుల సంబరాల వరకూ వెళ్లింది. ఏదిఏమైనా అర్ధరాత్రి ఈ ట్రెండ్‌ను నివారించకపోతే 'తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లుగా' మద్యం వరకూ ఆగిపోకుండా గంజాయి మత్తులో నేటి యువత ఎంత వరకైనా వెళ్లి చివరకు జైలు ఊచలు లెక్కపెట్టే పరిస్థితి ఉంటుంది. ఏదిఏమైనా తల్లిదండ్రులు, పోలీసు ఉన్నతాధికారులు, పాలకులు స్పందించకపోతే 'చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం లేదన్న చందంగా' తయారవుతుంది సమాజం.

ఎస్‌వియూలో 3వ అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం, ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్ఐ), తెలుగు సంపద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మూడవ అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలు ఫిబ్రవరి 27, 28 వ తేదీల్లో ఎస్వీయూలో నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై ఎస్వీయూ వీసీ ఆచార్య అప్పారావుతో తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, ఓఆర్ఐ సంచాలకులు ఆచార్య పీసీ వేంకటేశ్వర్లు, తెలుగు సంపద సంస్థ ప్రధాన సలహాదారు డాక్టర్ రేమిళ్ళ మూర్తి శనివారం చర్చించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సమావేశాల్లో పలు యూనివర్సిటీలు, కాలేజీలు, పరిశోధనా సంస్థలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. తెలుగు భాషా సాహిత్య అంశాలపై నిపుణుల ప్రసంగాలు, పరిశోధనా పత్రాల సమర్పణ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశాలకు హాజరయ్యే ప్రతినిధులు సమావేశాల నిర్వాహకులను సంప్రదించవచ్చన్నారు.



విసికి వినతిపత్రం అందిస్తున్న తెలుగు విభాగాధిపతి, వోఆర్ఐ సంచాలకులు

రేపు ఐతేపల్లి సింగిల్ విండో మహాజన సభ

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): ఈనెల 30వ తేదీ ఐతేపల్లి సహకార సంఘం మహాజన సభ నిర్వహించనున్నట్లు అఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి ప్రదీప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్యాలయ ఆవరణలో నిర్వహించే సమావేశంలో 2024 ఏప్రిల్ ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు నిర్వహించిన లావాదేవీలు, జమా ఖర్చులు, 2023–2024 ఆర్థిక సంవత్సరం ఆడిట్ నివేదికను పరిశీలించి ఆమోదం కోరుతామన్నారు. సంఘం కంప్యూటీకరణలో భాగంగా సంఘ సభ్యులు తమ ఈకేవైసీ కోసం ఆధార్, భూమి పాసు పుస్తకాలు ఇప్పటి వరకు సమర్పించని సభ్యులను, సంఘంలో సభ్యులుగా వుంటూ చనిపోయిన వారిని, సంఘ పరిధిలో నివాసం లేకుండా మరో గ్రామానికి వెళ్లిన సభ్యులను, సంఘ పరిధిలో రెండేళ్లుగా సంఘంలో ఎలాంటి లావాదేవీలు నిర్వహించని సభ్యులను, భూమి లేని సభ్యులను గుర్తించి, వారి సభ్యత్వం రద్దు చేస్తామన్నారు. సంఘం సభ్యులు, సిబ్బంది ఈ మహాజన సభకు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రసన్న వెంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -రామచంద్రాపురం: వడమాల పేట మండలం అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రోత్సవాలు శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, అర్చన నిర్వహించారు. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పెరిటాసి మాసం రెండవ శనివారం ఆలయంలో పవిత్ర ఉత్సవాలు నిర్వహించడంతో తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులకు ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, కంకణ బట్టర్ సూర్యకుమార్ ఆచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సుధారెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: టిడిపి మహిళా నేత, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) సతీమణి పులివర్తి సుధారెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆర్ సి పురంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల టిడిపి కార్యాలయం వద్ద టిడిపి, జనసేన, బిజెపి నాయకులు భారీ కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి మాట్లాడుతూ చంద్రగిరిలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఘనవిజయం సాధించడంలో సుధారెడ్డి పాత్ర కీలకమన్నారు. చంద్రగిరి కోటపై టిడిపి జెండా ఎగురవేయ డంలో పులివర్తి సుధారెడ్డి అహర్నిశల కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సి జనార్దన్ చౌదరి, కోర హరి ప్రసాద్, మాజీ సర్పంచ్ బాదురు ధనుంజయులు, సురేష్ నాయుడు, కే నరసింహా రెడ్డి, ధనుంజయ రెడ్డి, బండి విజయ్ కుమార్ రెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వసంత నాయుడు, సురేంద్ర నాయుడు, నాగభూషణం పాల్గొన్నారు.



సుధారెడ్డి జన్మదినం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి: ఎంపిడివో

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: హౌసింగ్ లే అవుట్లలోని ప్రతి లబ్ధిదారులు వారి ఇళ్ల నిర్మాణాలను గడువుకు లోపు పూర్తి చేసుకోవాలని బిఎన్ కండ్రిగ ఎంపీడీవో త్రివిక్రమ రావు కోరారు. శనివారం మండల పరిధిలోని కుంభాకం, బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీల హౌసింగ్ లేఅవుట్లు వద్ద హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ మునిరాజా, హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి నందిని పర్యవేక్షణలో 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడివో త్రివిక్రమ రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి నెలాఖరు లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవా లని సూచించారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను లబ్ధిదారులు పూర్తి చేసుకోవా లని, గడువు ముగిస్తే ఈ పథకం రద్దయ్యే అవకాశం వుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ పంచాయతీ సెక్రెటరీ నందిని, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అనిల్ కుమార్, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న అధికారులు

గూడూరు టౌన్ : గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు రామలింగయ్య కాలనీలో 'మన ఇల్లు – మన గౌరవం'పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా టిడిపి మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హౌసింగ్ లేఅవుట్లలోని ప్రతి లబ్ధిదారులు వారి ఇళ్ల నిర్మాణాలను గడువు లోపు పూర్తి చేసుకోవాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి నెలాఖరు లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. వివిధ దశల్లో నిర్మాణంలో వున్న గృహాలను సంబంధిత లబ్ధిదారులు వెంటనే పూర్తి చేసుకుంటే బిల్లులు జమ అవుతాయన్నారు. గడువు పూర్తయితే ఈ పథకం రద్దవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యారమాపు హేమ కుమార్ రెడ్డి , ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి , కృష్ణమూర్తి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బాబు , సచివాలయ సిబ్బంది, గృహ లబ్ధిదారులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : పేదవారి ఇంటి కలలు నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యం అని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. 'మన ఇళ్లు.. మన గౌరవం'లో భాగంగా పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో గృహాల లబ్ధిదారులకు శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతంలో అపార్టుమెంట్ నిర్మాణానికి లబ్ధిదారులు నగదు రూపంలో అందించారని, వారికి మంజూరైన ఇళ్లను పూర్తి చేసి అందిస్తామన్నారు. వారెవరూ ఆందోళన చెందవద్దని, గతంలో గృహ నిర్మాణం మంజూరైన వారు పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు మార్చి లోపు పూర్తి చేయకుంటే బిల్లులు అందవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దారు వెంకటేశ్వర్లు, పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, కౌన్సిలర్లు కేశవాచారి, జీవి మురళి కృష్ణ, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్, వెంకటరత్నం, వర్క్ ఇన్‌స్పెక్టర్, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘ, సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'సహకార సంఘాన్ని బలోపేతం చేసుకోవాలి'

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తడుకు సహకార సంఘాన్ని రైతుల కృషితో ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని సహకార సంఘం అధికారిణి ఏ ఝూన్సీ తెలిపారు. శనివారం తడుకు వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపు 20 గ్రామాలకు, 4 వేల మంది రైతులకు సహకారికిగా వున్న సహకార సంఘం నేడు 80 మందికి పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సహకరిస్తే వ్యాపార లావాదేవీల నిర్వహించేందుకు ఆర్థికంగా బలోపేతం చేసుకోవచ్చన్నారు. ఈ సంఘం ద్వారా రైతులకు ఎరువులు, క్రిమి సంహారక మందులు, వేరుశనగ, వరి విత్తనాలు తెప్పించి రాయితీ ధరలకు పంపిణీ చేస్తామని తెలిపారు. రైతుల సభ్యత్వ నమోదు చేసి కంప్యూటరీకరణ చేస్తామని తెలిపారు. అనంతరం 2023 –24 ఆడిట్‌ను ఆమోదిం చారు. సభ్యులు వుంటూ మృతి చెందిన రైతులు, ఇతర ప్రాంతా లకు వెళ్లిన వారు ఉంటే వారి కుటుంబ సభ్యులు సభ్యత్వం నమోదు చేసు కోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో సహకార సంఘం మాజీ అధ్యక్షు లు శ్రీనివాసులు రెడ్డి, ఎస్ బాలసుబ్రహ్మణ్యం రాజు, పుత్తూరు డివిజన్ సహకార సిబ్బంది నిరంజన్ బాబు, వెంకటరమణ, సీఈఓలు బద్రీనాథ్, వేణు, వినోద్, డైరెక్టర్లు అంబు, కేశవ మండడి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సహకార సంఘం అధికారిణి ఝాన్సి


విష జ్వరాలపై అప్రమత్తత అవసరం

- ఎంజీఎం హాస్పిటల్స్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్ : ప్రస్తుత వాతావరణంలో మార్పుల దృష్ట్యా ప్రజలు పల్లెల్లో జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారని వారికి తగు వైద్య సేవలు అవసరమని , చాలా అప్రమత్తంగా వుండాలని ఎంజీఎం హాస్పిటల్స్ డైరెక్టర్ మయూర్ పేర్కొన్నారు. మండలంలోని ముళ్లపూడి ఎస్టి కాలనీలో ప్రజల ఆరోగ్య దృష్ట్యా శ్రీకాళహస్తి నియోజక వర్గ సిపిఐ కార్యదర్శి గురవయ్య, మండల కార్యదర్శి శివకుమార్, ఏఐటీయూసీ శ్రీధర్ అభ్యర్థన మేరకు ఎంజీఎం హాస్పిటల్స్ వైద్య సిబ్బంది శనివారం ఆ ప్రాంతంలో పర్యటించి ప్రజలకు అవసరమైన ఆరోగ్య సలహాలు, మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఎంజీఎం హాస్పిటల్స్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ ప్రజలు విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శ్రీకాళహస్తి ఎంజీఎం హాస్పిటల్స్‌లో జనరల్ మెడిసిన్, ఇతర పలురకాల వైద్య సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉంటారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానికులు ఎంజీఎం హాస్పిటల్స్ యాజమాన్యానికి, వైద్య సిబ్బందికి ముళ్లపూడి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఏ ఫైవ్ హోటల్‌కు బెస్ట్ అవార్డు

ప్రజాశక్తి -చిల్లకూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పోటీలో 'ఏ ఫైవ్ హోటల్'కు విశిష్ట పురస్కారం అందుకుందని ఏ5 హోటల్ ఎమ్‌డి భద్రగిరి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ 27వ తేదీ సాయంత్రం విజయవాడ లోని శిల్పకళా వేదికలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మన రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఏ5 హోటల్ 2019లో స్థాపితమై, ఐదు సంవత్సరాలుగా అందరి ఆదరాభిమానాలను చూస్తూ గూడూరు, నెల్లూరు పరిసర ప్రాంతాల వారికి అందుబాటులో ఉంటూ అన్ని విధాలుగా సహకరిస్తున్న ఏ ఫైవ్ హోటల్ యాజమాన్యం ఆనందం వ్యక్తం చేసింది. అతిథి దేవోభవ' అనే నినాదంతో స్టార్ హోటల్ అనుభవాన్ని అందుబాటులో తక్కువ ధరలోని అందించాలని ధ్యేయంతో పనిచేస్తున్నామని యాజమాన్యం తెలిపింది. తాము క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వరుసగా మూడవసారి ఈ అవార్డు అందుకోవడం తమకు మరింత బాధ్యతను పెంచుతుందని, మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కొత్త ఆలోచనలతో ప్రయాణికులను, కస్టమర్లను ఆహ్లాద పరుస్తూనే ఉంటామని వివరిం చారు. రేట్లు అందరికీ ఆమోదయోగ్యంగానే ఉంటాయని తెలిపారు. విహారి మెరుగు ఫ్రంట్ ఆఫీస్ మేనేజర్, జయంత్ ఆపరేషన్ మేనేజర్, విజయ కన్నన్ రెస్టారెంట్ మేనేజర్, రంజిత్ దాస్ ఎగ్జిక్యూటివ్ చీఫ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఏ ఫైవ్ హోటల్ యాజమాన్యం

క్రైం న్యూస్

హత్య కేసులో నిందితుడు అరెస్టు



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేశామని గూడూరు రూరల్ స్టేషన్ సిఐ కిషోర్ బాబు పేర్కొన్నారు. గూడూరు రూరల్ పరిధిలోని తిప్పవరప్పాడులో గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సిఐ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు బిసి కాలనీ లో వుంటున్న అనందమ్మతో నిందితుడు రమేష్ సహజీవనం చేస్తుండే వాడు అన్నారు. ఇటీవల మనస్పర్థల కారణంగా మహిళను క్రరతో దారుణంగా కొట్టడంతో చనిపోయిందన్నారు. అన్నారు. మహిళ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిందన్నారు. నిందుతుడు పరారీ అయ్యాడని, శనివారం ఉదయం గూడూరు రూరల్ పరిధిలోని తిప్ప వరప్పడు కూడలి వద్ద నిందితుడిని అరెస్టు చేశామని తెలిపారు. అనంతరం రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బందిని అభినందించారు.

టీకాతో రాబీస్ నివారణ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి -దొరవారిసత్రం : జంతువులు కరవడం ద్వారా మానవాలకు వ్యాపించే రాబీస్ నిర్మూలనకు నేడు యాంటీ రాబీస్ టీకా ద్వారా వ్యాధి సోకకుండా కట్టడి చేయవచ్చని వైద్యాధికారి చైతన్య పేర్కొన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాబీస్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా శనివారం ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం వైద్యం అందుబాటులో లేక ఎందరో ఈ వ్యాధికి గురై మరణించారని, నేడు రాబీస్‌కు బలికాకుండా అందుబాటులోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో యాంటీ రాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో వుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ సంపూర్ణమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ మురళి, స్టాఫ్ నర్స్ అనురాధ, ఏఎన్ఎంలు వెంకమ్మ, శ్రావణి, డోరతి, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

టాస్క్‌ఫోర్స్ జిల్లా అధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని టాస్క్‌ఫోర్స్ జిల్లా అధికారి వైద్యుడు శ్రీనివాసరావు ఆదేశించారు. గూడూరు మండలం పోటుపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలోని గర్భిణులకు వైద్య పరీక్షలు చేయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు , ఆరోగ్యంపై పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం పలు రికార్డులు తనిఖీ చేశారు. సచివాలయం వారిగా వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ జ్యోతి , నాగేంద్ర , సూపర్ వైజర్ నరేష్ , టెక్నీషియన్ ప్రకాష్, సూపర్ వైజర్ ఉమ , సౌజన్య, కవిత, శశికళ పాల్గొన్నారు.

4న బహిరంగ వేలం పాట

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పురపాలక సంఘం కూరగాయల మార్కెట్, మటన్ దుకాణాలు, చేపల మార్కెట్, వివిధ దుకాణాల వారి వద్ద దినసరి రుసుం , చికెన్ దుకాణాల వారి వద్ద 2024–25 ఆర్థిక సంవత్సరానికి దినసరి కిస్తీల వసూలుకు అక్టోబర్ 4వ తేదీ స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహించనున్నట్లు గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లీజు గడువు 2024, అక్టోబరు 5వ తేదీ నుండి 2025, మార్చి 31వ తేదీ వరకు ఉంటుందన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: టిడిపి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- తడ: సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. తడ మండలం కాదులూరు పంచాయతీలో ఇది 'మంచి ప్రభుత్వం 'ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వ అడ్డగోలు పరిపాలనలో రాష్ట్ర సంక్షోభంలోకి వెళ్లిందని సంక్షోభంలోనూ సంక్షేమం అందించి అభివృద్ధికి రెక్కలు తొడిగి మొదటి వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని నిరూపించుకుందని, సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రతి సమస్యను పరిష్కరిం చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. సూపర్ 6 పథకాలతో రాష్ట్రం ముందుకు వెళుతోందన్నారు. టిడిపి నాయకులు సుదర్శన రావు, కాదులూరు మాజీ సర్పంచ్ , టిడిపి నాయకులు వేలూరు చంద్రయ్య మాట్లాడుతూ కాదులూరు పంచాయతీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తున్నారని, పంచాయతీలో సిసి రోడ్లు సిసి డ్రైన్స్, శ్మశానానికి దారి, తదితర అన్ని సమస్యలు చంద్రయ్య పట్టుదలతో పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి, తడ మండల టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కానిస్టేబుల్ నుండి రక్షణ కల్పించండి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పోలీసుల శాఖలో విధులు నిర్వర్తించే ఏలుమలై రెడ్డి నుండి రక్షణ కల్పించాలని అతని భార్య ఉష శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియా ఎదుట వాపో యింది. గత కొన్ని రోజులుగా వేరొక అమ్మాయిని పెళ్లి చేసుకున్నానని, విడాకులు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని తెలిపింది. ఏలుమలై రెడ్డి బెదిరింపులను వారి ఉన్నతా ధికారులకు చెప్పడంతో ఇప్పుడు మరింతగా బరితెగిం చాడన్నారు. తిరుపతి దిశ పోలీస్ స్టేషన్‌లో కేసు ఇప్పటికే నమోదైందని న్యాయం చేయాలని కోరా డు. ఈ సమావేశంలో ఉష సోదరుడు పురుషోత్తం పాల్గొన్నారు.

ఘనంగా సుధారెడ్డి పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) తెలుగు మహిళా టిడిపి నాయకురాలు పులివర్తి సుధా రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మంగళం టిడిపి యువ నాయకులు మంగళం నాని ఆధ్వర్యంలో తిరుపతి రుయా హాస్పిటల్ వద్ద 500 మంది పేదలకు అన్నదానం చేశారు. టిడిపి మండల మహిళా అధ్యక్షు రాలు రామాంజేరి మహేశ్వరి ఆధ్వర్యంలో మంగళం టిడిపి కార్యాలయంలో కేక్ ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ అధ్యక్షులు ఈశ్వరయ్య, మండల పార్టీ కార్యదర్శి గోపీనాథ్ పాల్గొన్నారు.